అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీవో అంకిత్

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

తాడ్వాయి, జనవరి16 : ముందస్తు మొక్కులు చెల్లించుకునే భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నదని, వారి సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో అంకిత్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్కింగ్ స్థలాల్లో కాజ్‌వే పనులను వేగవంతం చేయాలన్నారు. మంచినీటి బావుల్లో పూడికతీసే పనులను పూర్తి చేసి, పార్కింగ్ స్థలాల్లో గ్రౌండ్ లెవలింగ్‌ను సక్రమంగా చేపట్టాలన్నారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

ఘనంగా పుట్ట మల్లన్న జాతర

పట్నాల వద్ద మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్తులు

ములుగు రూరల్, జనవరి16 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలో పుట్ట మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం ప్రతి ఇంటి నుంచి బోనాన్ని తీసుకొచ్చి ఆలయం వద్ద ఉంచారు. మంగళవారం ఉదయం పట్నాలు వేయగా బోనాలను సమర్పించి మల్లన్నకు మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా సుమారు పది గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

కోడి పందేల స్థావరంపై దాడులు

మంగపేట, జనవరి 16 : మండలంలోని తిమ్మంపేట పరిధి అబ్బాయిగూడెం శివారులో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా మూడు కోడి పుంజులు, రూ.2300 స్వాధీనం చేసుకున్నారు. పందెం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

యువకుడి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి ఆర్థిక సాయం

రమేశ్‌కు నగదు అందిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం, జనవరి16 : తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన యువకుడు రమేశ్‌కు ఉపాధి కల్పించేందుకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన గాందర్ల రమేశ్ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతని తల్లిదండ్రులు కొంత కాలం క్రితమే మృతి చెందారు. ఎలాంటి జీవనాధారం లేకపోవడంతో తాడ్వాయి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య ఈ విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఇయన రూ.50 వేలు తక్షణమే గాందర్ల రమేశ్‌కు అందించారు. ఇతడికి ఉపాధి కల్పించేందుకు ఏదైనా వాహనం కొనుగోలు చేసేందుకు పార్టీ నాయకత్వం కసరత్తు చేస్తున్నది. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, శివాలయం కమిటీ చైర్మన్ తాడూరి రఘు, నాయకులు ఎజాజ్, గండపెల్లి నర్సయ్య, పులుసం పురుషోత్తం, బట్టు రమేశ్, వావిలాల స్వామి, కాత యాదగిరి, ఆలం సంతోష్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, తాడ్వాయి బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు మల్లయ్య, తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, తాడ్వాయి ఉప సర్పంచ్ ఇంద్ర సేనా రెడ్డి తదితరులు ఉన్నారు.

చలివాగులో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ భవేశ్ మిశ్రా

తాత్కాలిక రోడ్డు వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

టేకుమట్ల, జనవరి16 : టేకుమట్ల– రాఘవరెడ్డి పేట గ్రామాల మధ్య చలివాగుపై ఉన్న వంతెన తెగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో చలివాగులో తాత్కాలిక మట్టి రోడ్డును వెంటనే ఏర్పాటు చేసి రవాణాను కొనసాగించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇటీవల వర్షాలకు కూలిన వంతెనను ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. దసరా ముందు నిర్మించిన ఇనుప వంతెనతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడం, పెద్ద వాహనాలు వెళ్లకపోవడం నేపథ్యంలో రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని, అందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు వారు సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రాజయ్య, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేణి ఐలయ్య, గాదర్ల అశోక్, సర్పంచ్ పండుగ శ్రీను, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగం చిరస్మరణీయం

భూపాలపల్లి రూరల్ : మాతృ భూమి రక్షణ కోసం అసువులు బాసిన సైనికుల త్యాగం చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 76వ ఆర్మీ దినోత్సవంలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రజలు భయం లేకుండా జీవించగలుగుతున్నారంటే ఆ గొప్పతనం సైనికులదేనని, రేయింబవళ్లు అప్రమత్తంగా ఉంటూ సరిహద్దులను కాపాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ రాములు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కృష్ణకాలనీ : భూపాలపల్లి మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, లేనిపక్షంలో కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. మంగళవారం 1, 14, 30 వార్డుల్లోని సెగ్గంపల్లి, జంగేడు, రెడ్డికాలనీల్లో ఆయన పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, అవసరమున్న చోట సైడ్ కాల్వలు నిర్మించాలని సూచించారు. ఈ సందర్భంగా సెగ్గంపల్లిలో రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, ఆర్ఐ భాస్కర్, ఏఈ మానస, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు దేవన్, బుర్ర కొమురయ్య, క్యాతరాజు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతరలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగే మినీ మేడారం జాతరలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ఆయన జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెలలో చిట్యాల మండలం పూరేడుగుట్ట, మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లి, భూపాలపల్లి మండలం కమలాపూర్, రేగొండ మండలం తిరుమలగిరి, వెంకటాపురం మండలం గుర్రంపేట గ్రామాల్లో జాతరలు జరుగనున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి

గణపురం : కొత్తపల్లిలో మహిళలు వేసిన ముత్యాల ముగ్గులు

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఘనంగా వేడుకలు
- ఇళ్ల ముందు అలరించిన రంగవల్లులు
- గాలిపటాలు ఎగరేసిన చిన్నారులు

కృష్ణకాలనీ/మహాముత్తారం/చిట్యాల/కాటారం/ఏటూరునాగారం/మంగపేట/తాడ్వాయి/గోవిందరావుపేట/ వాజేడు/ వెంకటాపురం (నూగూరు), జనవరి 16 : జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో సోమవారం సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. పంట చేతికొచ్చిన వేళ, కొత్త ఏడాదిలో వచ్చిన తొలిపర్వదినం సందర్భంగా ఉదయాన్నే ఇళ్ల ముందు రంగురంగుల అందమైన ముగ్గులు వేశారు. ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు, రేగు పండ్లు, నవధాన్యాలు, కూరగాయలను రంగవల్లుల్లో అలంకరించారు. పండుగను పురస్కరించుకొని హరిదాసులు పాటలు పాడుతూ ఇంటింటికీ తిరిగారు. చిన్న, పెద్ద అనే తేడాలేకుండా గాలిపటాలను ఎగురవేశారు. ఇందులో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. ఆయా కాలనీల్లో ఆయా కాలనీల్లో ప్రజా ప్రతినిధులు, పెద్దల సమక్షంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహాముత్తారం మండలంలో సంక్రాంతి వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు సొంతూళ్లకు రావడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. చిట్యాల మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గోపాలపూర్ తదితర గ్రామాల్లో యువతకు, చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాటారం మండలంలో మకర సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, శుభాలు కలగాలని వేడుకున్నారు. కనుమ సందర్భంగా రైతులు పశువులను రంగులతో అలంకరించారు. మహిళలు నోములను ఇచ్చిపుచ్చుకున్నారు. గణపురం మండలంలోని కొత్తపల్లి యూత్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, విష్ణువర్ధన్, దేవేందర్, అఫ్రోజ్, సూర్య, రాజ్‌కుమార్, అబ్బు, శ్రీనివాస్, స్వాతి, హరిచందన, అనూష, ఆఫ్రీన్, అక్షర, శ్రీనిత తదితరులు పాల్గొన్నారు. ఏటూరునాగారం మండలంలో సోమవారం గౌరమ్మ తల్లి సన్నిధిలో మహిళలు వివిధ రకాల నోములు నోచుకున్నారు. వీటిని కనుమ పండుగ రోజున ఇచ్చి పుచ్చుకున్నారు. ఆర్యవైశ్యుల వాసవీ సాయి గ్రూపు ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన నోముల పంపిణీ కార్యక్రమంలో సంఘం సభ్యులు నోములు ఇచ్చి పుచ్చుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగపేట మండల అకినేపల్లిమల్లారంలో వికాస్ అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. గ్రామంలోకి వచ్చిన గంగిరెద్దులకు ఆహారం పెట్టి, నూతన వస్త్రాలను సమర్పించి సంప్రదాయం చాటారు. వేడుకల్లో జాతీయ మిర్చి బోర్డు డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి పాల్గొన్నారు. వాజేడు మండలంలోని ప్రగళ్లపల్లి శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను భక్తులు రథంలో ఊరేగించారు. మహ శివరాత్రి నాడు శివపార్వతుల కల్యాణం జరిపేందుకు మార్చి 8 రాత్రి 12 గంటలకు శుభ ముహూర్తం పెట్టి వరపూజ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెంకటాపురం (నూగూరు) మండలంలోని పలు గ్రామాల్లో దాతల సాయంతో గ్రామస్తులు ముగ్గుల పోటీలు, ఆత్రాపురంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి ఎంపీపీ చెరుకూరి సతీశ్, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ప్రముఖ వ్యాపారి గూడవర్తి నర్సింహామూర్తి నగదు బహుమతులు అందజేశారు.

పాడి పంటలకు ప్రతీక సంక్రాంతి

- భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, జనవరి 16 : పాడి పంటలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురిజాల నర్సయ్య స్మారకార్థం సోమవారం భూపాలపల్లి 11వ వార్డు వేశాలపల్లిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగ రోజు ఆడపడుచులంతా ఇండ్ల ముందు అందమైన ముగ్గులు వేస్తూ మన సంప్రదాయాలను భావితరాలకు తెలియజేస్తున్నారన్నారు. ముగ్గులు మహిళలల్లో ఉన్న కళా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, కురిమిళ్ల రజితాశ్రీనివాస్, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు దేవన్, గణపురం వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, నాయకులు గురిజాల రవి, చల్లూరి సమ్మయ్య, ఆకుల మల్లేశ్, మధు, క్యాతరాజు సాంబమూర్తి, బుర్ర కొమురయ్య, బట్టు కరుణాకర్, ఆకుల మహేందర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా హేమాచలుడి నిశ్చితార్థం

- తరలి వచ్చిన భక్తులు
- కిటకిటలాడిన మల్లూరు పరిసరాలు

మంగపేట, జనవరి 16 : మండలంలోని మల్లూరులో మంగళవారం రాత్రి హేమాచల లక్ష్మీ నర్సింహస్వామి వారి కల్యాణ నిశ్చితార్థం (వరపూజ)వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతిఏటా సంక్రాంతి పర్వదినాన వరపూజ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. గుట్టపై ఆలయంలో భద్రాచాల రామాలయ, స్థానిక అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజలు మొదలయ్యాయి. ఆదిలక్ష్మి–చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవ విగ్రహాలకు కోనేటిలో జలాభిషేకాలు, తిల, తైలాభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలతో ముస్తాబు చేశారు. సాయంత్రం 5గంటలకు పల్లకీ సేవల చేశారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మల్లూరు గ్రామంలోని సంక్రాంతి మండపం వద్దకు తీసుకొచ్చి ఆసీనులను చేశారు. శంభులింగేశ్వర స్వామి ఆలయం నుంచి శివ, పార్వతుల ఆగమనం జరిగాక, పూర్వబాద్ర నక్షత్ర యుక్త కర్కటలగ్న దైవాంశ సుముహూర్తా నిశ్చితార్థం జరిపారు. 2024 మే 23న వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు అభిజిత్ లగ్న సుముహూర్తాన స్వామి వారి కల్యాణానికి ముహూర్తం ఖరారు చేశారు. అర్చక బృందం భక్తులకు ఆశీర్వచనం చేసి, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఈవో సత్యనారాయణ, చైర్మన్ ముకుందం, భద్రాచలం అర్చకులు మురళీకృష్ణమాచార్యుల బృందం, స్థానిక ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, రాజశేఖర్‌శర్మ, పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చందుశర్మ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ధనసరి సూర్య, మాజీ చైర్మన్లు పూజారి శ్రీను, సమ్మయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్వామి వారిని పల్లకీలో తీసుకొస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

ధాన్యం పక్కదారి

- ఐకేపీ సెంటర్ నుంచి మిల్లుకు తరలిస్తుండగా ఘటన
- డీసీఎం, ఆటోను పోలీసులకు అప్పగించిన రైతులు

ఆటోలో తరలిస్తున్న ధాన్యం

వెంకటాపూర్, జనవరి 16 : రైతుల నుంచి సేకరించిన ధాన్యం మిల్లుకు చేరేలోపే కొందరు అక్రమార్కులు బస్తాలను పక్కదారి పట్టిస్తున్నారు. ఐకేపీ సెంటర్ నుంచి డీసీఎం ద్వారా మిల్లుకు చేర్చే క్రమంలో ఈ తతంగమంతా జరుగుతున్నది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నల్లగుంట గ్రామానికి చెందిన రైతు పేర్ల శ్రీనివాస్ ఆయన సోదరుడికి చెందిన ధాన్యాన్ని స్థానిక ఐకేపీ సెంటర్ నుంచి వెల్తుర్లపల్లి గ్రామంలోని మిల్లుకు డీసీఎంలో తరలిస్తున్నాడు. మొత్తం నాలుగు లోడ్‌లకు గాను రెండు లోడ్‌లు పంపించగా రెండో ట్రిప్‌లో తూకంలో ధాన్యం తక్కువగా వచ్చినట్లు గమనించాడు. నాలుగో ట్రిప్‌లో డీసీఎం లోడ్ చేయించి కొందరు రైతులతో కలిసి రోడ్డు పక్కన కాపలా ఉన్నాడు. కాగా, నల్లగుంట –పాలంపేట గ్రామాల మధ్యలో డీసీఎం నుంచి ఎనిమిది బస్తాలు వేరే ఆటోలో ఎక్కిస్తుండగా రైతులు అక్కడికి వెళ్లగా డీసీఎం డ్రైవర్ పారిపోయాడు. ఆటో డ్రైవర్‌ను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై చల్ల రాజును వివరణ కోరగా రైతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైన్స్ ఫెస్టివల్‌కు విద్యార్థుల ఎంపిక

మహదేవపూర్, జనవరి 16 : ఈ నెల 17 నుంచి 20 వరకు హర్యానాలోని ఫరీదాబాద్‌లో నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినులు సల్పాల దేవిక, ఆకుతోట మల్లిక ఎంపికైనట్లు హెచ్‌ఎం బుచ్చయ్య తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తరపున సైన్స్ ఉత్సవాల్లో పాల్గొంటారని, వీరి వెంట గైడ్ టీచర్లు ప్రభాకర్, మడ్క మధు ఉంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కుట్టు మిషన్‌లను అందజేస్తున్న సతీశ్‌రెడ్డి

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ములుగురూరల్, జనవరి 16 : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన పీఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రూ.50లక్షల విలువైన కుట్టు మిషన్లు పోచంపల్లి సమకూర్చగా బీఆర్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ ఏరువ సతీశ్‌రెడ్డి 300 మంది మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మహిళలకు 40 రోజుల పాటు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి ఉపాధి కోసం మిషన్లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, రజిత, రవీందర్, దిలీప్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయహస్తాన్ని అమలు చేయాలి

కృష్ణకాలనీ, జనవరి 16 : ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని దళితులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం 'అంబేద్కర్ అభయహస్తం'ను వెంటనే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పీక రవికాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ. 12 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని, ఎస్సీల రిజర్వేషన్ 18 శాతానికి పెంచుతామని, ఎస్సీ వర్గీకరణ చట్టానికి చర్యలు తీసకుంటామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని అన్నారు. అలాగే ఎస్సీ రిజర్వేషన్లపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నేరెళ్ల జోసఫ్, ఎండీ షాబీర్, ఎండీ యాకుబ్‌పాషా, బల్లెం రాజ్‌కుమార్, కాసరబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

పలిమెల, జనవరి 16 : ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుండెపోటు రావడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లెంకలగడ్డ చర్చ్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు మహదేవపూర్ మండలం బెగులూరు గ్రామానికి దశరథం పలిమెల మండలం పంకెనకు పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ప్రయాణంలో లెంకలగడ్డ చర్చ్ వద్దకు రాగానే అపస్మారక గుండెపోటుతో ద్విచక్రవాహనం పైనుంచి కిందపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ముద్దునూరు తండాలో గంజాయి కలకలం

100 డయల్‌తో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ములుగురూరల్, జనవరి16 : ములుగు మండలం ముద్దునూరుతండా గ్రామానికి గంజాయి సరఫరా అవుతుందనే విషయం కలకలం రేపుతుంది. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన కొందరు 100కు కాల్ చేసి గ్రామంలో గంజాయి సరఫరా అవుతుందని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ములుగు సీఐ మేకల రంజిత్‌కుమార్ గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలో సర్పంచ్‌తో పాటు మరో ఇద్దరు యువకులను అనుమానితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తరలించి గ్రామానికి చెందిన సర్పంచ్ ద్విచక్ర వాహనంలో భద్రపర్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ములుగు పోలీసులు గంజాయి కలకలంపై కూపి లాగుతున్నారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా గంజాయి విషయమై తాము దర్యాప్తు చేస్తున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో పాల్గొనాలి

ములుగురూరల్, జనవరి16 : జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె జిల్లా రవాణా అధికారి బీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపొందించిన రోడ్డు భద్రత అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో రఫిక్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ఏటూరునాగారం/ వెంకటాపురం (నూగూరు) జనవరి 16 : ఏటూరునాగారం, వెంకటాపురం (నూగూరు) మండలాల తహసీల్దార్లగా ఖాజామొయినుద్దీన్, సర్వర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వారిని బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.. ఏటూరునాగారం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఖాజామొయినుద్దీన్ ఐటీడీఏ పీవో అంకిత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, తహసీల్దార్‌కు ఎంఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

రహదారుల సమస్యలు తెలుపాలి

దొడ్ల వాగు వద్ద నిర్మించిన డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

ఏటూరునాగారం, జనవరి 16 : రహదారులపై ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తెలియజేయాలని ఎస్పీ శబరీశ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని చిన్నబోయినపల్లి నుంచి కొండాయి వరకు ఉన్న రహదారిని ఏఎస్పీ సంకీర్త్‌తో కలిసి పరిశీలించారు. మేడారం జాతర సందర్భంగా ఛత్తీస్‌గఢ్, భద్రాచలం ప్రాంతం నుంచి వచ్చే భక్తులకు ప్రయాణంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొండాయి నుంచి ఊరట్టం కాల్వపల్లి రహదారులను పరిశీలించారు. గత వర్షాకాలంలో భారీగా వచ్చిన వరదలకు దొడ్ల సమీపంలోని జంపన్న వాగుపై ఉన్న వంతెన కొట్టుకుపోయిన విషయం తెలిసింది. మేడారం భక్తుల రాకపోకలకు అసౌకర్యం కలుగకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ దారులపై ఎస్పీ దృష్టి సారించారు. గతంలో ఈ రహదారి వెంట ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయా? ఏం చర్యలు తీసుకున్నారనే వివరాలు స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. చిన్నబోయినపల్లి, కొండాయి మార్గంలో ప్రతి రోజూ ఎన్ని వాహనాలు నడిచే అవకాశాలు ఉన్నాయని అడిగారు. మార్గ మధ్యంలో ఎక్కడెక్కడ పార్కింగ్ కోసం స్థలాలు కేటాయించారు? అక్కడి పరిస్థితులు, ఏర్పాట్లపై ఎస్పీ ఆరా తీశారు. దొడ్ల వాగు వద్ద ఆర్అండ్ బీ ఆధ్వర్యంలో నిర్మించిన డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. కొట్టుకుపోయిన వంతెన పరిశీలించి వచ్చిన వరదను అడిగి తెలుసుకున్నారు. డైవర్షన్ రోడ్డు పటిష్టతపై ఆరా తీశారు. ఇక్కడ జాతర సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భావించారు. వారి వెంట సీఐ రాజు, ఎస్సై కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

కోటగుళ్లలో ఓఎస్‌డీ దంపతుల పూజలు

కోటగుళ్లలో పూజలు చేస్తున్న ఓఎస్‌డీ అశోక్ కుమార్, ప్రియాశుక్లా దంపతులు

గణపురం, జనవరి 16 : మండల కేంద్రంలోని గణపేశ్వరాయం కోటగుళ్లలో మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓఎస్డీ అశోక్‌కుమార్–ప్రియాశుక్ల దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరేశ్‌చార్యులు వారిని సాదరంగా ఆహ్వానించి స్వామి వారికి మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, VOJJALA MEENA KUMARI, D/o. Dinkar Rao, R/o. 13-4-15, PNo. 504, Gouri Apt., Mattewada, Warangal, TS. Changed My Name as AVUNOORI MEENA, W/o. Rathnakar Rao.
NT-319337
★I, VYAMSANI SRINIVAS, R/o. 11-9-408, Rd.No. 25, O'City, Near LIC Sales and Training Office, Warangal-506 002, T.S. Changed My Name as VAMASANI SRINIVAS, S/o. Vyamsani Laxminarayana.
NT-319337

CHANGE OF NAME
I, GORUKANTI SOMAKKA, W/o. GORUKANTI PRABHAKAR RAO (New Name), previously called G.SAMAKKA, W/o. GORUKANTI PRABHAKAR RAO (Old Name), and R/o. H.No. 1-7-183, Revenue Colony, Subedari, Hanamkonda Mandal, Hanumakonda Dist.- 506001, T.S., India. and solemnly declare.

CHANGE OF NAME
I, THATIPALLY MADHAVI, W/o. THATIPALLY GOPALA KRISHNA MURTHY (New Name), previously called BHUVANAGIRI MADHAVI, D/O. RAVINDRA GUPTA (Old Name), and R/o. H.No. 2-5-267 to 270/303, Flat No. 303, Srikrishna Enclave, Nakkalagutta, Beside: Narayana School, VTC Hanamkonda, Hanumakonda Dist.- 506001, T.S., India. and solemnly declare.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618 9182777213
WARANAGAL 9182777556 9182777557 9182777558
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565